మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

TGBIL/25/A0512

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం
04 అక్టోబర్ 2026

పేజీలు : 6

@mvaartanews

www.mivaartanews.com


# మంత్రి పొంగులేటి సారు..
# కబరస్తాన్ కాపాడండి సారు..?

## - మంత్రి హామీతో కబరస్థాన్ గేటు తెరిపింపు





**సత్తుపల్లి,అక్టోబర్ 03 మీ వార్త టౌన్ రిపోర్టర్**

సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన తాపీ మేస్త్రి సయ్యద్ జానీ శనివారం ఉదయం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు జండాల చెట్టు సమీపంలోని కబరస్థాన్‌కు తీసుకెళ్లగా, ఫారెస్ట్ అధికారులు గేటుకు తాళం వేసి అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వాహనాన్ని ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు అడ్డుకుని తమ సమస్యను మంత్రికి వివరించారు. కబరస్థాన్‌లో తమ సామాజిక వర్గానికి చెందిన మృతదేహాలను గత కొన్నేళ్లుగా ఖననం చేస్తున్నామని, అర్బన్ పార్క్ ఏర్పాటైన తర్వాత ఫారెస్ట్ అధికారులు గేటుకు తాళం వేసి ఖననం చేయకుండా అడ్డుకుంటున్నారని,మంత్రికి తెలిపారు. వారి సమస్యను విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అంత్యక్రియల కార్యక్రమాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి, ఫారెస్ట్ అధికారులతో మాట్లాడారు. దీంతో కబరస్థాన్ గేటుకు వేసిన తాళాన్ని అధికారులు తెరిపించారు. మంత్రి చొరవతో అంత్యక్రియలకు ఏర్పడిన అడ్డంకి తొలగడంతో ఎన్టీఆర్ నగర్ ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# అమ్మ ఋణం తీర్చుకోలేనిది.
# అమ్మ పేరు తో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటండి.

## - ఎర్త్ యూనీవర్సీటీ వైస్ ఛాన్సలర్ జగన్ మోహన్.

**కొత్తగూడెం అక్టోబర్ 3 మీ వార్త ఆర్ సి**







ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ " ఏక్ ఫేడ్ మా కే నామ్ " పిలుపు మేరకు ఈ రోజు కొత్తగూడెం కార్పోరేషన్ 12 వ వార్డు లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన ఎర్త్ యూనీవర్సీటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జగన్ మోహన్ వారి అమ్మ లక్ష్మీ కుమారి పేరు తో ఒక మొక్కను నాటి "జీవితాంతం తల్లిని భుజాల మీద వేసుకుని తిరిగి సేవ చేసిన ఆమె మనల్ని ఈ లోకం లోకి తీసుకుని రావడానికి ప్రసవం సమయంలో అనుభవించిన చిన్న నొప్పి యొక్క ఋణం కూడా తీర్చుకోలేము" అని ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పారు .అలాంటి అమ్మ పేరుతో ఒక మొక్క నాటి దానిని పరిరక్షిస్తే దాని వల్ల లబ్ది పొందిన వారి దీవెనలు ఆమె ఖాతాలో పుణ్యాలు చేర్చిన వారమౌతాం అని అన్నారు. ఈ సందర్భంగా మొక్కల వెంకటయ్య మాట్లాడుతూ మానవ మనుగడకు మూలాధారం చెట్లు అని అన్నారు .అలాంటి ఒక చెట్టును అమ్మ పేరు తో నాటి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాన మంత్రి ఆశయాన్ని పరిపూర్తి చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్ సుల్తానా మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో మోడ్రన్ ఇఖ్రా స్కూల్ మొదటి నుంచి ముందుందని అన్నారు. ప్రతి విద్యార్థి మరియు టీచర్లు మీ మీ అమ్మల పేరుతో మొక్కలు నాటి స్వచ్ఛమైన గాలి పొందడానికి దోహదపడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్, సౌమ్య , ఈశ్వర్ టీచర్లు లక్ష్మీ ప్రసన్న, రుబీనా, నసరత్, సల్మా, ఖాజా , ఎన్విరాన్మెంటల్ స్టూడెంట్ మురారి తదితరులు పాల్గొన్నారు.

# 44వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్ష
# పదవికి ఎన్నికైన మాచర్ల తిరుమలరావు.

## - పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా నా వంతు కృషి చేస్తామాచర్ల తిరుమలరావు

**ఖమ్మం, అక్టోబర్ 03,మీ వార్త ప్రతినిధి.**



ఖమ్మం నగరంలోని 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మాచర్ల తిరుమలరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు , మైనారిటీ నాయకులకు , మహిళా నాయకులకు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎన్నిక చేసినందుకు ప్రతి ఒక్కరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్, ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, 44వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి జగదీష్, మైనారిటీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 44వ డివిజన్‌లోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని, నాయకులు, కార్యకర్తల సమన్వయంతో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిబద్ధతతో పనిచేస్తానన్నారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం తనకు 44వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు రావడానికి ప్రోత్సహించి అండగా నిలిచిన గుడిపూడి జగదీష్, మైనారిటీ నాయకుడు షేక్ హుస్సేన్ లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాచర్ల తిరుమలరావు మాట్లాడుతూ, తనకు లభించిన అధ్యక్ష పదవి బాధ్యత అనేది కేవలం పదవి కాదని, 44వ డివిజన్ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి మరింత సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని తెలిపారు.

# రోస్టర్ సవరణ కోసం మాలల సమర శంఖం.

## - అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీలో భారీ సభలి

## - మాల విద్యార్థులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి: చెట్టి సురేష్

**మణుగూరు అక్టోబర్ 3 మీ వార్త ప్రతినిధి :**



మాల సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా రోస్టర్ విధానంలో అవసరమైన సవరణలు సాధించేందుకు అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మాల విద్యార్థులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగుల భారీ సభను విజయవంతం చేయాలని మాల సంఘాల జేఏసీ పినపాక నియోజకవర్గం అధ్యక్షుడు చెట్టి సురేష్ పిలుపునిచ్చారు. రోస్టర్ విధానంలో మాల సామాజిక వర్గానికి ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులను సభలో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రోస్టర్ విధానంలో మాలలకు న్యాయం జరిగేలా అవసరమైన సవరణలు సాధించేందుకు భవిష్యత్ కార్యాచరణను ఈ సభలో రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. మాల విద్యార్థులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులు ఐక్యంగా ముందుకు వచ్చి తమ హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెట్టి సురేష్ అన్నారు. అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే ఈ భారీ సభకు మాల విద్యార్థులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులు, మాల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రోస్టర్ సవరణ సాధన కోసం మాలల సమర శంఖం పూరిస్తున్న ఈ సభను విజయవంతం చేయాలని పినపాక నియోజకవర్గం అధ్యక్షుడు చెట్టి సురేష్. జూపెల్లి ధ్రువకుమార్ కోరారు...

# ఒంటరి నిరుపేద మహిళలకు
# సొంత గూడు కల్పించాలి

## - ఇంటి స్థలం లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని తహసీల్దార్‌కు వినతి

**చర్ల, అక్టోబర్ 3 మీ వార్తా ప్రతి**



చర్ల మండలంలో నివాస వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒంటరి నిరుపేద మహిళలకు ప్రభుత్వం ఇంటి స్థలం లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని మహిళా రక్షణ సంఘం, లోక్ రక్షక్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం చర్ల మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోక్ రక్షక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి కే. ప్రమోద్, మహిళా రక్షణ సంఘం భద్రాచలం డివిజన్ అధ్యక్షురాలు చిట్టి మల్ల సుజాత మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, అత్తమామల ఆదరణ లేక సమాజంలో తోడూ నీడా లేక అనేక మంది ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కనీస నివాస వసతి లేక ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు పడుతున్న మహిళల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. మండలంలో అర్హత కలిగిన ప్రతి ఒంటరి నిరుపేద మహిళకు ఇంటి స్థలం లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేసి భద్రమైన నివాసాన్ని కల్పించాలని వారు అధికారులను కోరారు. మహిళల సమస్యలను గుర్తించి అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ రక్షక్ పార్టీ నాయకులు కొండా చరణ్, మహిళా రక్షణ సంఘం నాయకులు కూరపాటి స్వరూప, వెంకటలక్ష్మి, సంధ్య, నాగరాణి, దేవి, రాధా, సరస్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రగ్బీ పోటీల్లో కారేపల్లి మైనార్టీ
## గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**కారేపల్లి, అక్టోబర్ 3 : మీ వార్త ప్రతినిధి**

ఖమ్మం పట్టణంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సెప్టెంబర్ 29న నిర్వహించిన అస్మిత సిటీ రగ్బీ లీగ్ పోటీల్లో కారేపల్లికి చెందిన వైరా మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అండర్-15 విభాగంలో రన్నరప్గా నిలవగా, అండర్ - 18 విభాగంలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విద్యార్థులు సాధించిన విజయాల పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ డి.సావిత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజేత విద్యార్థులను ప్రిన్సిపాల్తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా శిక్షణ అందిస్తూ, వారిలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేసిన పీఈటీ, పీడీలను ప్రత్యేకంగా ప్రశంసించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ జాటోత్ రామచంద్రనాయక్ చేతుల మీదుగా అంతర్జాతీయ శాంతి విశిష్ట పురస్కారం అందుకున్న అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి

నేలకొండపల్లి అక్టోబర్ 03 మీ వార్త ఆర్ సి




నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి హైదరాబాదులోని బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్తులో అంతర్జాతీయ శాంతి విశిష్ట పురస్కారం (ఇంటర్నేషనల్ పీస్ ఎక్సెలెన్స్ అవార్డు) లభించింది. ఈ అవార్డును డాక్టర్ దివ్యమూర్తి తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రనాయక్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఇన్పాక్ట్ ఫౌండేషన్ వారు దివ్యమూర్తి ప్రతిభను చూసి ఈ అవార్డు ను అందించడం జరిగింది. దివ్యమూర్తి లాంటి మేధావులు ప్రతిభావంతులు ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమని డిప్యూటీస్పీకర్ రామచంద్రనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా దివ్యమూర్తి మాట్లాడుతూ తనకు ఈ సన్మానం జరగడం ఎంతో సంతోషంగా ఉందని ఇప్పటివరకు తనకు 85 అవార్డులు వచ్చాయని తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో అందేకర్ శ్రీనివాస్, డాక్టర్ వంశీకృష్ణ, దివ్యమూర్తి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ స్థాయి కానిస్టేబుల్ ప్రిలిమినరీ మాక్ టెస్ట్ కు విశేష స్పందన





సత్తుపల్లి అక్టోబర్ 03 మీ వార్త ఆర్ సి

సత్తుపల్లి జేవియర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కానిస్టేబుల్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో నమూనా పరీక్షను ఓఎంఆర్ పద్ధతిలో శనివారం నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చేతుల మీదుగా ఆవిష్కరించి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 76 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష ఫలితాలను వాట్సాప్ గ్రూపు లో వెల్లడి చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రానున్న నవంబర్ డిసెంబర్ మొదటి వారాలలో మరల నమూనా పరీక్షలు నిర్వహించి విద్యార్థులను పరీక్షకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి తమవంతు కృషి చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ గోపి తెలిపారు. ఇట్టి అవకాశాన్ని నియోజకవర్గ స్థాయిలో కానిస్టేబుల్ ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు వినియోగించుకోవాలని గౌరవ ఎమ్మెల్యేమట్టా రాఘమయి కోరారు. ఈ కార్యక్రమంలో పరీక్షా నిర్వాహకులు డాక్టర్ ఎస్ బాబు డాక్టర్ కె పద్మారాణి పీర్ సాహెబ్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యకు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలి -- ఎన్ఎస్ఎఫ్ డిమాండ్

- మీ పిల్లలకు ఇలాంటి వసతులే ఉన్నాయా
- కనీస వసతుల సౌకర్యం ఇవ్వనప్పుడు ప్రీ ప్రైమరీ స్కూల్ ఎందుకు? చిన్న పిల్లల భవిష్యత్తు నాశనం చేయటానికేనా
- విద్యను నిర్లక్ష్యం చేసిన వ్యాపారం చేసిన చూస్తూ ఊరుకోం ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్

కరకగూడెం అక్టోబర్ 03 మన మీ వార్త:



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యను ప్రవేశపెట్టడం స్వాగతించదగిన నిర్ణయమే అయినప్పటికీ, అందుకు అవసరమైన మౌలిక వసతులు లేకుండా అమలు చేయడం చిన్నారుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ ( NSF ) పేర్కొన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతి గదులు, చిన్నారులకు అనువైన ఫర్నిచర్, మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీరు, ఆట వస్తువులు, భద్రతతో కూడిన వాతావరణం వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రీ-ప్రైమరీ విద్యను సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యం కాదన్నారు. అదే విధంగా ప్రీ ప్రైమరీ స్కూల్ లలో కనీసం ఇప్పటివరకు విద్యార్థులకు యూనిఫాం, బుక్స్ మరియు ప్రీ ప్రైమరీ కి ఉండవలసిన వసతులు అందుబాటులోకి తీసుకురాలేదు.

**NSF ప్రధాన డిమాండ్లు:**

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీకి ప్రత్యేక తరగతి గదులు ఏర్పాటు చేయాలి. చిన్నారులకు అవసరమైన ఫర్నిచర్, ఆట వస్తువులు, బోధనా సామగ్రిని అందుబాటులో ఉంచాలి. పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీరు, భద్రతా వసతులు కల్పించాలి. అవసరమైన ఉపాధ్యాయులు మరియు సహాయక సిబ్బందిని వెంటనే నియమించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. విద్య ప్రతి చిన్నారి హక్కు. నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత. మౌలిక వసతులు కల్పించకుండా విద్యను అమలు చేయడం సమంజసం కాదు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలి. కొన్ని స్కూళ్లలో టీచర్లు సెల్ఫోన్లతో టైం పాస్ చేస్తున్నారు వారిపై ప్రత్యేకంగా నిగా పెట్టాలని తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాంటి టీచర్లపై కఠినంగా శిక్షించాలని ఎన్ఎస్ఎఫ్ డిమాండ్ చేస్తున్నాం.

# సత్తుపల్లి రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ ?

- కొత్త కార్యాలయ భవనం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన జిల్లా రవాణా అధికారి





సత్తుపల్లి అక్టోబర్ 03మీ వార్త అర్ సి

సత్తుపల్లి ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మపురి జగదీష్ సత్తుపల్లి రవాణా శాఖ యూనిట్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, కార్యాలయ పరిసరాలు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. అనంతరం సత్తుపల్లిలో మండలం గంగారం గ్రామం రవాణా శాఖ కార్యాలయం ఏర్పాటుకు కొత్తగా కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని ఖమ్మం జిల్లా రవాణా అధికారి పరిశీలించారు. కార్యాలయ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను నిర్వహణ లో ఉన్న అధికారి ఎం వి ఐ రాజశేఖర్, అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి రవాణా శాఖ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ సయ్యద్,బడేసాబ్, హోంగార్డులు ప్రసాద్ రావు, కృష్ణారావు, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయానికి ప్రభుత్వ స్థలం కేటాయింపుఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్, ఆధ్వర్యంలో కార్యాలయ మార్పునకు చర్యలుసత్తుపల్లిసత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, కార్యాలయాన్ని నూతన ప్రదేశానికి మార్చే ప్రక్రియ చేపట్టారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్, ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ప్రభుత్వ స్థలాన్ని ఆర్టీఏ కార్యాలయానికి కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మ పూరి జగదీష్ పరిశీలించారు. సత్తుపల్లి ప్రాంత ప్రజలకు రవాణా శాఖ సేవలు మరింత అందుబాటులో ఉండేలా కార్యాలయాన్ని నూతన ప్రదేశానికి మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యేమట్టా రాగమయి తెలిపారు ఎమ్మెల్యే తెలిపారు ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి తలకు తీవ్రమైన గాయాలు.

- అత్యవసర మెదడు శస్త్రచికిత్సతో రోగి ప్రాణాలు నిలబెట్టిన మలక్ పేట్ యశోదా వైద్యులు.
- రోడ్డు ప్రమాద బాధితుల్ని కాపాడడంలో సత్వర స్పందన, అధునాతన వైద్యం అత్యంత కీలకం.

ఖమ్మం, అక్టోబర్ 3,మీ వార్త ప్రతినిధి.

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మెదడులో రక్తస్రావం, వాపుతో పాటు మాస్ ఎఫెక్ట్, మిడ్‌లైన్ షిఫ్ట్ ఏర్పడిన 29 ఏళ్ల యువకుడికి తొలుత డీకంప్రెసివ్ క్రానియెక్టమీ నిర్వహించి, ఆ సమయంలో తొలగించిన పుర్రె ఎముక భాగాన్ని పొత్తికడుపు ముందుభాగంలో భద్రపరిచి, రోగి కోలుకున్న అనంతరం దానిని తిరిగి అమర్చి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతంగా క్రానియోప్లాస్టీ నిర్వహించారు. ఖమ్మం జిల్లా అశ్వాపురానికి చెందిన చింతల సురేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రమైన ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజ్యూరీకి గురయ్యారు. ఆయనకు లెఫ్ట్ ఫ్రంటల్ సబ్‌డ్యూరల్ హెమరేజ్‌తో కూడిన హెమరేజిక్ కంట్యూషన్, మాస్ ఎఫెక్ట్, మిడ్‌లైన్ షిఫ్ట్ ఏర్పడ్డాయి. వీటితో పాటు బైలేటరల్ ఫ్రంటల్, టెంపోరల్ సల్కల్ స్పేసెస్‌లో సబ్‌అరాక్నాయిడ్ హెమరేజ్, రైట్ ఫ్రంటోటెంపోరల్ సబ్‌డ్యూరల్ హెమరేజ్, ఫాల్సైన్ సబ్‌డ్యూరల్ హెమరేజ్, డిఫ్యూజ్ సెరిబ్రల్ ఎడిమా కూడా ఉన్నట్లు గుర్తించారు. కుడివైపు పెరైటల్,స్క్వామస్, మాస్టాయిడ్ టెంపోరల్ బోన్స్‌లో ఫ్రాక్చర్స్‌తో పాటు రైట్ ఎక్స్‌టర్నల్ ఆడిటరీ కెనాల్ యాంటీరియర్ వాల్ ఫ్రాక్చర్ కూడా ఏర్పడింది. తీవ్రమైన మెదడు గాయాల నేపథ్యంలో సురేష్‌కు లెఫ్ట్ఫ్రంటో టెంపోరో పెరైటల్ డీకంప్రెసివ్ క్రానియెక్టమీ, డ్యూరోటమీ, సబ్‌డ్యూరల్ హెమరేజ్, లెఫ్ట్ ఫ్రంటల్ కంట్యూషన్ ఎవాక్యుయేషన్, సిస్టర్నోటమీ,సిస్టర్నల్ డ్రెయిన్ ప్లేస్‌మెంట్, జీ-ప్యాచ్‌తో డ్యూరాప్లాస్టీ నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స సమయంలో తొలగించిన బోన్ ఫ్లాప్‌ను యాంటీరియర్ అబ్డామినల్ వాల్‌లో,అంటే పొత్తికడుపు ముందు భాగంలోని గోడలో భద్రపరిచారు. తొలి శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న సురేష్‌కు పుర్రెలో ఏర్పడిన క్రానియెక్టమీ డిఫెక్ట్‌ను సరిచేసేందుకు సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డా. శ్రీనివాస్ బొట్ల పర్యవేక్షణలో జనరల్ అనస్తీషియా కింద లెఫ్ట్ ఫ్రంటో టెంపోరో పెరైటల్ బోన్ ఫ్లాప్ రీప్లేస్‌మెంట్ క్రానియోప్లాస్టీ నిర్వహించారు. పొత్తికడుపులో భద్రపరిచిన బోన్ ఫ్లాప్‌ను తిరిగి అమర్చి టైటానియం ప్లేట్లు, స్క్రూలతో స్థిరపరిచారు. శస్త్రచికిత్స అనంతర కాలం ఎలాంటి సమస్యలు లేకుండా సాగింది. ఫిజియోథెరపీతో పాటు ఐవీ యాంటీబయాటిక్స్, యాంటీఎపిలెప్టిక్స్, అనాల్జెసిక్స్, యాంటీఎమెటిక్స్, పీపీఐలు, ఐవీ ఫ్లూయిడ్స్ తదితర చికిత్స అందించారు. డిశ్చార్జ్ సమయానికి సురేష్ స్పృహలో, పరిసరాలపై అవగాహనతో, వైద్యుల ఆదేశాలకు స్పందించే స్థితిలో ఉన్నారు. వైటల్స్ స్థిరంగా ఉండగా గ్లాస్గో కోమా స్కేల్ ఈ4వీ5ఎం6, అంటే 15 కు15గా నమోదైంది. శస్త్రచికిత్స చేసిన గాయం కూడా ఆరోగ్యకరంగా




ఉండటంతో తదుపరి వైద్య సూచనలతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. డా. శ్రీనివాస్ బొట్ల మాట్లాడుతూ,తీవ్రమైన ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజ్యూరీలో మెదడులో రక్తస్రావం, వాపు, మాస్ ఎఫెక్ట్, మిడ్‌లైన్ షిఫ్ట్ వంటి సమస్యలు ఏర్పడినప్పుడు డీకంప్రెసివ్ క్రానియెక్టమీ అవసరమవుతుందని తెలిపారు. ఈ రోగిలో తొలగించిన బోన్ ఫ్లాప్‌ను యాంటీరియర్ అబ్డామినల్ వాల్‌లో భద్రపరిచారని, రోగి కోలుకున్న అనంతరం దానిని తిరిగి అమర్చి టైటానియం ప్లేట్లు, స్క్రూలతో స్థిరపరిచి క్రానియోప్లాస్టీ నిర్వహించినట్లు వివరించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. తీవ్రమైన తల గాయాల అనంతరం స్పృహ కోల్పోవడం, పదేపదే వాంతులు,తీవ్రమైన తలనొప్పి, సీజర్స్, అధిక నిద్రమత్తు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే న్యూరో వైద్యులను సంప్రదించాలని యశోదా ఆసుపత్రి యాజమాన్యం సూచించింది.

# కోయ భాషకు 8వ షెడ్యూల్‌లో స్థానం కల్పించాలి

- కోయ--గోండు భాషా ప్రామాణీకరణ సెమినార్‌లో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్‌కుమార్

చర్ల అక్టోబర్ 3 మీ వార్తా ప్రతినిధి

కోయ--గోండు భాషకు భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో స్థానం కల్పించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. భద్రాచలం గిరిజన భవన్‌లో విశ్వ గోండు సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోయ--గోండు భాషా ప్రామాణీకరణ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అక్టోబర్ 2 నుంచి 6వ తేదీ వరకు 18 రాష్ట్రాలకు చెందిన గోండు--కోయ భాషా నిపుణులతో ఈ సెమినార్ కొనసాగుతోంది. భాషావేత్త మడవి నెహ్రూ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల్లో ప్రాచీన గోండు భాషలోని పదాల వినియోగం, కాలక్రమంలో జరిగిన వక్రీకరణ, మూల పదాల సేకరణ తదితర అంశాలపై చర్చిస్తున్నారు. 2014 నుంచి 2026 వరకు నిర్వహించిన 12 సెమినార్ల ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 16 వేల పదాలను సేకరించినట్లు భాషా నిపుణులు తెలిపారు. సేకరించిన పదాలను క్రోడీకరించి డిక్షనరీ రూపంలో తీసుకురానున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా డా. మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గోండు--కోయ భాషకు రాజ్యాంగబద్ధమైన గుర్తింపు దక్కకపోవడం వల్ల ఆదివాసీల భాషా, సాంస్కృతిక అస్తిత్వానికి అన్యాయం జరుగుతోందన్నారు. గోండు భాషలో దేశంలోని పీఠభూములు, అడవులు, కొండలు, నదులు, చెట్లు, జంతువులు, పక్షులకు సంబంధించిన అనేక ప్రాచీన పేర్లు ఉన్నాయని పేర్కొన్నారు. పురాణాలు, జానపద, మౌఖిక సాహిత్యంలోనూ గోండు భాషకు విశిష్ట స్థానం ఉందన్నారు. గోండు భాష అభివృద్ధి చెందితే ఆదివాసీల చారిత్రక మూలాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే దశాబ్దాలుగా ఈ భాషకు అధికారిక గుర్తింపు దక్కకుండా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ సవరణల ద్వారా పలు భాషలకు 8వ షెడ్యూల్‌లో చోటు కల్పించినప్పటికీ గోండు భాషను మాత్రం గుర్తించకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్ర, ఆదిమ నాగరికతలకు సంబంధించిన అనేక అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గోండు భాషకు 8వ షెడ్యూల్‌లో గుర్తింపు లభిస్తే భాష మరింత అభివృద్ధి చెంది, ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, మూలాలను వెలుగులోకి తీసుకురావడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.




**తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకోవాలి**

తెలంగాణ ప్రభుత్వం గోండు--కోయ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డా. మైపతి అరుణ్‌కుమార్ కోరారు. ఆదివాసీ ప్రజాప్రతినిధులతో ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (గూజ) సమావేశం నిర్వహించి, గోండు--కోయ భాషకు రాజ్యాంగ గుర్తింపు కల్పించాలనే తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

గోండు--కోయ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, మాండలికాలు, భాషలను కాపాడేందుకు ఆదివాసీ విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భాష, సంస్కృతులను పరిరక్షించకపోతే ఆదిమ జాతి అస్తిత్వం ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆంధ్రప్రదేశ్ నేత రామారావు దొర, తుడుందెబ్బ రాష్ట్ర కోశాధికారి కల్తి రాంప్రసాద్, భద్రాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనం వరప్రసాద్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బచ్చల వెంకటేశ్వర్లు, భద్రాద్రి జిల్లా ప్రచార కార్యదర్శి చర్ప అశోక్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన గోండు--కోయ భాషా ప్రతినిధులు, భాషా నిపుణులు పాల్గొన్నారు.

# పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం

పశు వైద్యాధికారి టి. రామచందర్

**కామారెడ్డి :** గొల్లపల్లి గ్రామంలో పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించడం జరిగింది. మండల పశు వైద్యాధికారి డాక్టర్ టి.రామ్ చందర్ మాట్లాడుతూ పాడి పశువులలో వచ్చే గర్భకోశ వ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు ప్రస్తుతం ఎల్ నినో వర్షాభావ ప్రభావంతో పశువులకు గడ్డి కొరత ఏర్పడే అవకాశం ఉంది కావున పాడి రైతులు పచ్చగడ్డి పెంచుకోవాలి అని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 28 పశువులకు చూడి పరీక్షలు, 8 పశువులకు సాధారణ చికిత్సలు మరియు 10 దూడలకి నట్టల నివారణ మందులు వేయడం జరిగినది. ఈ శిబిరంలో గ్రామ సర్పంచ్ కిషన్ యాదవ్, వార్డు సభ్యులు, విఎల్ వో శ్రీనివాస్, జెవివో రాజ్ వీరయ్య , సిబ్బంది మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి సాయం సకాలంలో అందించాలి

**- పెండింగ్ నిధులు విడుదల చేయాలి.. తులం బంగారం హామీని అమలు చేయాలి**

**- కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన చర్ల బీఆర్ఎస్ నాయకులు**

**చర్ల, అక్టోబర్ 3 మీ వార్తా ప్రతినిధి**



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో అందించాలని చర్ల మండల బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి పథకం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం చర్ల బీఆర్ఎస్ మండల కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు, భద్రాచలం నియోజకవర్గ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ సూచనలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 12.71 లక్షల కుటుంబాలకు రూ.11,130 కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు.

ప్రస్తుతం వివాహం అనంతరం లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందడంలో జాప్యం జరుగుతోందని, దీంతో పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని కొనసాగిస్తున్నప్పటికీ, సాయం సకాలంలో అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన తులం బంగారం హామీని అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయడంతో పాటు, తులం బంగారం హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, కుంభతిని రాము, గోరింట్ల వెంకటేశ్వరరావు, ఎడ్ల రాందాస్, కనుకు భద్రం, అలవాల కృష్ణ, పాసిగంటి సంతోష్, సయ్యద్ సాదిక్, రాట్నాల శ్రీరామ్మూర్తి, గాదంశెట్టి కిషోర్, ఇన్నమూరి సృజన్, కుకడపు సాయి, సాంబశివరావు, మైపా వెంకటేశ్వర్లు, పంజా సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి- డీఈఓ వాసంతి

**సత్తుపల్లి అక్టోబర్ 03 మీ వార్త ఆర్ సి**

ఖమ్మం జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వాసంతిని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓ వాసంతి మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విద్యాసంస్థలను నిర్వహించాలని సూచించారు. యు డి ఐ సి ఈ , ఏపీపీ డబ్ల్యూఆర్, పరీక్షల నిర్వహణ, ప్రభుత్వ సెలవు దినాలు తదితర అంశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యాభివృద్ధి మరింత మెరుగ్గా సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా ప్రమాణాల పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల సంఘాల బాధ్యులు, అన్ని డివిజన్ల విద్యాసంస్థల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి








**- బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా నేరం**

**- నేరాల నియంత్రణకు అవగాహన దోహదం**

**- కామేపల్లి అవగాహన సదస్సులో ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జెడ్,జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కాకుమనీ జ్యోతిర్మయి**

**కామేపల్లి, అక్టోబర్ 3 మీ వార్త ప్రతినిధి :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జెడ్,జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కాకుమనీ జ్యోతిర్మయి కోరారు.కామేపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రైతు వేదికలో బాల్య వివాహాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.జూనియర్ కాలేజీ,ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాలు,బాలికల అక్రమ రవాణా,బాల బాలికలపై జరుగుతున్న నేరాల పై అవగాహన కల్పించి చైతన్య పరిచారు. అనంతరం మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా నేరమన్నా రు.వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.బాల బాలికల పట్ల జరుగుతున్న నేరాల నియంత్రణకు అవగాహన ఎంతో దోహదపడుతుందని అన్నారు.ఈ అవగాహన సదస్సులో ఎస్సై పి.శ్రీకాంత్, కామేపల్లి పోలీస్ సిబ్బంది, ఖమ్మం కోర్టు సిబ్బంది, ఎంపిడిఓ డి.సోంలాల్,ఏవో బి.తారా దేవి, డిప్యూటీ తాసిల్దార్ షేక్ రఫీ,ఎం పి ఓ వి వి ఎస్ శాస్త్రి, సర్పంచ్ అజ్మీర బుల్లి హరినాయక్, పంచాయతీ కార్యదర్శులు నరసింహ, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం రఘునాథ్,జూనియర్ కళాశాలకు చెందిన లెక్చరర్ ఎండి రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా 'మీకోసం మేమున్నాం'

**- ఒంటరి వికలాంగురాలి శస్త్రచికిత్సకు రూ.8 వేల ఆర్థిక సాయం**



**చర్ల, అక్టోబర్ 3 మీ వార్త ప్రతినిధి :** ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలుస్తూ 'మీకోసం మేమున్నాం టీం' మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా శస్త్రచికిత్స అవసరమైన ఓ ఒంటరి వికలాంగురాలికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది.

విజయకాలనీకి చెందిన శ్రీమతి కొంగూరు సత్యవతి (62) భర్త దివంగత పిల్లి దాసు. సంతానం లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్న ఆమె వికలాంగురాలు. సదరం పెన్షన్ ద్వారా వచ్చే ఆదాయంతోనే నిత్యజీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఆమెకు తీవ్ర కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యుల సహకారం లేక ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు గాల్ బ్లాడర్‌లో రాళ్లు ఉన్నట్లు నిర్ధారించి, శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

అయితే ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న సత్యవతికి శస్త్రచికిత్స ఖర్చులు భరించడం పెద్ద భారంగా మారింది. అంతేకాకుండా తనకు అండగా నిలిచే వారు ఎవరూ లేకపోవడంతో ఆర్థిక సహాయం కోసం 'మీకోసం మేమున్నాం టీం'ను ఆశ్రయించారు. సత్యవతి పరిస్థితిని తెలుసుకున్న సంస్థ సభ్యులు వెంటనే స్పందించి, ఆమె శస్త్రచికిత్సకు అవసరమైన సహాయం అందించేందుకు ఫండ్ రైజింగ్ పోస్టును ఏర్పాటు చేశారు. దాతలు, సంస్థ సభ్యుల సహకారంతో రూ.8,000 నగదు సేకరించారు. సేకరించిన మొత్తాన్ని శుక్రవారం ఉదయం 11.30 గంటలకు 'మీకోసం మేమున్నాం' టీం కార్యాలయంలో సంస్థ కార్యవర్గ సభ్యులు గొట్టిపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా సత్యవతికి అందజేశారు.

ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ.. సమాజంలో ఆపదలో ఉన్న పేదలు, నిరుపేదలు, అండలేని వారికి భరోసాగా నిలిచేందుకు 'మీకోసం మేమున్నాం' సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స పొందలేని వారికి తమ వంతు సహాయం అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దాతలు అందిస్తున్న సహకారంతో మరింత మంది ఆపదలో ఉన్న వారికి చేయూత అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

సత్యవతికి అందించిన ఆర్థిక సహాయం ఆమెకు కొంతమేర భరోసాను కల్పించింది. ఈ సందర్భంగా సహాయం అందించిన దాతలకు, 'మీకోసం మేమున్నాం' టీం సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీవీ ప్రతాప్, కవ్వాల రాము, దొడ్డి సూరిబాబు, సింగ సంతోష్, అక్కినేని నెహ్రూ, గుద్దేటి బాలు, దొడ్డి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గర్గుల్‌లో ఘనంగా అవతార్ మెహర్ బాబా సెంటర్ 34వ వార్షికోత్సవ వేడుకలు

**ప్రేమ, సత్య సందేశాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

**కామారెడ్డి :** కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని అవతార్ మెహర్ బాబా సెంటర్ 34వ వార్షికోత్సవ వేడుకలను అక్టోబర్ 4న భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మెహర్ బాబా బోధించిన ప్రేమ, సత్యం, సేవ, ఆధ్యాత్మికత వంటి సందేశాలను ప్రజలకు చేరవేసేలా రోజంతా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వార్షికోత్సవ వేడుకలు ఉదయం 7 గంటలకు పుష్పమాల అలంకరణ, ప్రార్థన, హారతి కార్యక్రమాలతో ప్రారంభమవుతాయి. ఉదయం 7.15 గంటలకు ధుని కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం 7.30 గంటలకు సప్తవర్ణ పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుంది. 7.45 గంటలకు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 8.30 గంటలకు మెహర్ బాబా పల్లకి సేవ నిర్వహించనున్నారు. అనంతరం 10.15 గంటలకు వేదికపై స్వాగత ఉపన్యాసం ఉంటుంది. 10.20 గంటలకు గర్గుల్ సెంటర్‌కు చెందిన భక్తులు భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## గండుగులపల్లిలో ప్రత్యేక గ్రామసభ, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ





**దమ్మపేట అక్టోబర్ 3 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:**

వంటశాల డైనింగ్ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జారెదమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో వి.బి.జి. రామ్‌జీ ప్రత్యేక గ్రామసభతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే లిజారె ఆదినారాయణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామసభలో గ్రామానికి సంబంధించిన పలు అంశాలపై అధికారులు ప్రజలతో చర్చించారు అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం గండుగులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించి పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటశాల డైనింగ్ హాల్ నిర్మాణ పనులు పూర్తికావడంతో వాటిని ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆపద సమయంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే జారె

**దమ్మపేట అక్టోబర్ 3 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:**



ప్రమాదంలో గాయపడిన పోలీస్ కానిస్టేబుల్‌ను స్వయంగా తన వాహనంలో ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్యం అందేలా చేసిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మానవత్వాన్ని చాటుకున్నారు సత్తుపల్లి నుంచి గండుగులపల్లికి వెళ్తున్న సమయంలో సరోజినాపురం వద్ద గండుగులపల్లి గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ పిట్టల రాజు గారు ద్విచక్ర వాహన ప్రమాదానికి గురై గాయపడిన విషయాన్ని గమనించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే క్షతగాత్రుడిని తన వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఆసుపత్రిలో వైద్యులు ప్రథమ చికిత్స అందించే వరకు దగ్గరుండి పరిస్థితిని పరిశీలించారు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సకాలంలో వైద్యం అందించడమే ముఖ్యమని భావించి ఎలాంటి ఆలస్యం లేకుండా ఆసుపత్రికి తరలించడం ద్వారా తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు ఆపదలో ఉన్న సమయంలో వెంటనే స్పందించి అండగా నిలవడమే ప్రజా ప్రతినిధిగా తన బాధ్యత అన్నట్లుగా ఆయన వ్యవహరించారు. అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బొగ్గం రాజులగుంపు గ్రామానికి చెందిన జారె బాబురావు ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.

## 6న పొన్నెకల్లు లో మెగా పశు వైద్య శిబిరం - డాక్టర్ జి.నాగులు

**కామేపల్లి, అక్టోబర్ 3 మీ వార్త ప్రతినిధి :**



కామేపల్లి మండలం పొన్నెకల్లు గ్రామం లో ఖమ్మం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఐకార్ సహకారంతో ఈనెల 6న మెగా పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.నాగులు శనివారం తెలిపారు.పశువుల ఆరోగ్యం పై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ఉచితంగా పశు వైద్య సేవలను అందించడం జరుగుతుందన్నారు. రైతులు మెగా వైద్య శిబిరం లో పాల్గొని అవగాహన పొందాలని,పశువుల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు.ఈ మేరకు పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## గోదావరి కరకట్టను కాపాడాలి

**- ఇసుక తవ్వకాలు, భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలి**

**చర్ల, అక్టోబర్ 3 మీ వార్తా ప్రతినిధి**



: గోదావరి కరకట్టను ఇసుక తవ్వకాలు, భారీ వాహనాల రాకపోకల నుంచి రక్షించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజు డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ముంపు నుంచి చర్ల మండలంలోని ప్రజలు, గ్రామాలు, వ్యవసాయ భూములకు రక్షణ కల్పించేలా కరకట్ట పటిష్టతపై ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు. కరకట్ట పరిధిలో జరుగుతున్న ఇసుక కార్యకలాపాలను నియంత్రించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలు సమన్వయంతో కరకట్ట ప్రాంతంలో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని కోరారు. కరకట్టకు నష్టం కలిగించే కార్యకలాపాలను అడ్డుకోకపోతే ప్రజా ప్రయోజనాల కోసం ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో తాటి భూపతిదొర, సోడి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

సత్తుపల్లి అక్టోబర్ 03 మీ వార్త అర్ సి



సత్తుపల్లికిష్టారం గ్రామానికి చెందిన శేష కుమారి, సీతా మహాలక్ష్మి ఇటీవల గ్రీన్‌ఫీల్డ్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆరోగ్య పరిస్థితిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా లక్ష్మారెడ్డి తల్లి, సతీమణిని కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.2026 సెప్టెంబర్ 12వ తేదీ శనివారం రాత్రి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై జరిగిన ప్రమాదంలో గాయపడిన శేష కుమారి, సీతా మహాలక్ష్మి ఆరోగ్య పరిస్థితిపై వారు ఆరా తీశారు. అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కిష్టారం గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మట్టా, మువ్వా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మద్దులపల్లి సెల్ టవర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జనరేటర్, సామాగ్రి దగ్ధం

- భయాందోళనతో పరుగులు తీసిన ఆ ప్రాంత ప్రజలు
- మంటలను ఆర్పి వేసిన అగ్నిమాపక సిబ్బంది
- జనావాస ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న సెల్ టవర్ ను తొలగించాలని గ్రామస్తుల డిమాండ్

కామేపల్లి, అక్టోబర్ 3 మీ వార్త ప్రతినిధి :





కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో జనావాస ప్రాంతంలో ఉన్న సెల్ టవర్ వద్ద శనివారం ఆకస్మికంగా షార్ట్ సర్క్యూట్ తో మంటలు,దట్టమైన పొగ వ్యాపించాయి.దీంతో కాలనీవాసులు, గ్రామస్తులు భయాందోళనతో పరుగులు తీశారు.ప్రమాదంలో సెల్ టవర్ కు సంబంధించిన జనరేటర్, ఇతర సామాగ్రి దగ్ధమయ్యాయి.స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన వచ్చి స్థానికుల సహకారంతో మంటలను ఆర్పి వేశారు. గ్రామం లో నివాస ప్రాంతాల మధ్య ఉన్న సెల్ టవర్ తీవ్ర ప్రమాదకరంగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.కాగా సంబంధిత సెల్ టవర్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవ డం వల్ల గ్రామస్తుల ప్రాణాల కు ముప్పుగా పరిణమించిం దని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.?అధికారులు తక్షణమే స్పందించి, ప్రమాదకరంగా ఉన్న ఈ సెల్ టవర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని,ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.లేని ఎడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమించు.

- సత్యం,ప్రేమ,శాంతి, సేవాభావాలతో కూడిన నైతిక విలువలను కలిగి ఉండాలి.

ఖమ్మం, అక్టోబర్ 03,మీ వార్త ప్రతినిధి.



ఖమ్మం వీడియోస్ కాలనీ టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ నందు ఖమ్మం జిల్లా మరియు టౌన్ అన్ని పాస్టర్స్ ఫెలోషిప్స్ వారి సహకారముతో ఆదరణ మినిస్ట్రీస్ ఉత్సవాలు నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులుగా దైవజనులు బ్రదర్ క్రిష్టి పాల్గొని మాట్లాడారు.దేవుని కుమారుడు మన పాపాలను కడుగుటకై భూమిపై వచ్చి ఉన్నాడని మనిషి కుమారుడుగా జన్మించి శిలువపై తమ రక్తాన్ని చిందించి మన పాపములను శుద్ధి చేసి ఉన్నాడని పేర్కొన్నారు. నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమించు, శత్రువులను కూడా క్షమించే గొప్ప హృదయాన్ని కలిగి సేవాభావంతో ఉండాలి,శాంతి మార్గంలో నడవాలని ఏసుప్రభు బోధనలను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువత తమ జీవితాన్ని కేవలం స్వార్థం కోసం కాకుండా పెంచి పోషించిన తల్లిదండ్రుల కొరకు మరియు దేశం కొరకు త్యాగం చేయాలని అలాగే సత్యం,ప్రేమ,శాంతి, సేవాభావాలతో కూడిన నైతిక విలువలను పెంపొందించుకోవాలని అన్నారు. వయసులో ఉన్నప్పుడు వచ్చే రకరకాల ఆకర్షణలు,చెడు అలవాట్లకు దూరంగా ఉండి, నీతివంతమైన పవిత్రమైన జీవితాన్ని గడపాలని కోరారు . ఆదివారం కూడా ఈ సభ కొనసాగుతుందని సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని ఆహ్వానించువారు పాస్టర్ అభిషేక్ ఆదరణ మినిస్ట్రీస్ ఖమ్మం తెలిపారు.

## ఆర్‌కామ్‌పై సీబీఐ చార్జిషీట్

**న్యూఢిల్లీ :** అనిల్ అంబానీకి చెంది న రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్(ఆర్‌కామ్‌పై) సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. రూ.3,750 కోట్లు మోసం చేసిన కేసులో ఆర్‌కామ్‌తోపాటు ఎల్ఐసీ మాజీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అధికారిపై చార్జిషీట్ దాఖలు చేసినట్టు సీబీఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 2012 లో రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ జారీచేసిన రూ.1,500 కోట్ల విలువైన ఎన్‌సీడీలను ఎల్ఐసీ కొనుగోలు చేసిందని సీబీఐ దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఎన్‌సీడీల కొనుగోలులో అక్రమాలు జరిగాయని గుర్తించిన సీబీఐ..దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ నలుగురు నిందితులపై ఐపీసీ కింద నేరపూరిత కుట్ర, మోసం, నమ్మకద్రోహం వంటి నేరాలతోపాటు, అవినీతి నిరోధక చట్టం-1988 పరిధిలోకి వచ్చే నేరాలకు సంబంధించి కూడా చార్జిషీట్ దాఖలు చేశారని సీబీఐ వర్గాలు వెల్లడించాయి.

# సినీ గాన వాహిని సంగీత కార్యక్రమం.

- మధుర గీతాలతో మైమరిపించిన 'సినీ గాన వాహిని'పాత--కొత్త సినీ గీతాల సంగమంతో అలరించిన స్వర సరిగమ.

ఖమ్మం, అక్టోబర్ 03,మీ వార్త ప్రతినిధి.

సంగీత విభావరి ఖమ్మం పట్టణంలోని స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో స్వర సరిగమ ఆధ్వర్యంలో 'సినీ గాన వాహిని' సంగీత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వర సరిగమ అధ్యక్షులు వివి రెడ్డి అధ్యక్షతన స్వర సరిగమ అధ్యక్షుడు కాలే జనార్ధన్, ఉపాధ్యక్షులు ఎన్ పావని, ఆధ్వర్యంలో జరిగిన జరిగిన ఈ కార్యక్రమం సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.పాత తరం మధుర గీతాలతో పాటు నేటి తరాన్ని అలరించే సినీ పాటలను గాయకులు ఆలపిస్తూ ప్రేక్షకులను సంగీతానుభూతిలో ముంచెత్తారు. ఒక్కో పాటకు ప్రేక్షకుల నుంచి లభించిన స్పందన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంగీతం తరతరాలను అనుసంధానించే వారధిగా నిలుస్తుందనే విషయాన్ని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. సినీ సంగీతానికి సంబంధించిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తూ, కళాకారులకు వేదిక కల్పించడం ద్వారా స్వర సరిగమ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కళా, సంగీత రంగాల అభివృద్ధికి ఇటువంటి





కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని సంగీతాభిమానులు ఆకాంక్షించారు.స్వర సరిగమ గౌరవ అధ్యక్షులు ఎం గిరిజా దేవి, ప్రముఖ గాయకురాలు కీర్తన,ఎం స్వప్న,పంజా మాలతి నాయుడు, తుంగ వెంకటేశ్వరరావు, గద్దల కుటుంబరావు, భీమాల వినోద్, ఎం ప్రమీల,వి కళ్యాణి, ఎం సురేఖరవి, రమ, శకుంతల, నవీన్, ముల్లపురి లక్ష్మయ్య, జడ్పూరి వెంకటేశ్వర్లు, బి ముత్యం, జి ఎల్లయ్య, జి సుధాకర్, టి దేవమని, కే శ్యాముందర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రభుత్వం.





- తల్లాడ మండలం పినపాక గ్రామంలో 79 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

ఖమ్మం,తల్లాడ, అక్టోబర్ - 3, మీ వార్త ప్రతినిధి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం పేదల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తల్లాడ మండలం పిన్నపాక గ్రామంలో మంత్రి 79 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి తో కలిసి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8,21,000 కోట్ల అప్పుల్లోకి నెట్టివేశారని, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భారీగా నిధులు వృధా చేశారని విమర్శించారు. పేదవారికి ఇళ్లు ఇవ్వాలన్న ఆలోచన గత ప్రభుత్వానికి రాలేదన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఇందులో ఇప్పటికే దాదాపు 2,25,000 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మిగిలినవి శరవేగంగా పూర్తవుతున్నాయని వివరించారు. రెండవ విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పిన్నపాక గ్రామంలో 79 మంది అర్హులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తున్నామని, వీటిలో ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఇతర సోదరీమణులు ఉన్నారని తెలిపారు.డ్వాక్రా మహిళలకు రూ. 70,000 కోట్ల మేర సున్నా వడ్డీ రుణాలు అందించడం జరిగిందని, రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేయడంతో పాటు రైతు భరోసా, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్ 200 యూనిట్ల వరకు, రేషన్ కార్డుల పంపిణీ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే రెండున్నర సంవత్సరాల పాలనలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని, పేదల సంక్షేమమే ప్రధాన అజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్ల తోపాటు, స్థలాలు లేనివారికి స్థలాల పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేశామన్నారు. సర్వే చేసి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి చేకూర్చుతామన్నారు.కార్యక్రమంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంతోనే పేదల అభ్యున్నతి, సంక్షేమం సాధ్యమని అన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లను మంజూరు చేశారని తెలిపారు. పిన్నపాక గ్రామానికి మొదటి విడత కింద 25 ఇళ్లను కేటాయించి, ఒక్కో ఇంటికి రూ . 5 లక్షల సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలను గుర్తించి నేడు 79 మంది అర్హులకు ప్లాట్ల పట్టాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.మహిళలకు అత్యున్నత గౌరవం ఇస్తూ, డిజిటల్ రేషన్ కార్డులను కుటుంబ యజమానులైన మహిళల పేరిటే అందజేస్తున్నామని అన్నారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ . 10 లక్షల ఆరోగ్యశ్రీ, రైతులకు రుణమాఫీ, ధాన్యానికి బోనస్ వంటి పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలవుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పినపాక గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 174 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన, రియల్ హీరో పైలెట్ కెప్టెన్ స్మిత్ మచ్చన్

- శుభాకాంక్షలు తెలుపుతూ మొక్క నాటిన మొక్కల కె .ఎన్ రాజశేఖర్.

కొత్తగూడెం అక్టోబర్ 3 మీ వార్త ఆర్సీ






దుబాయ్ నుంచి ఇజ్రాయిల్ కి వెళుతున్న ఫ్లై దుబాయ్ ఎఫ్ జెడ్ 1073 ఫ్లైట్ ని నడుపుతున్న పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చన్ పై ఒమన్ కి చెందిన హమమ్ అల్ హమ్మామీ అనే కో పైలట్ కత్తితో దాడి చేసి సుమారు 174 మంది ప్రయాణికులతో ఉన్న ఫ్లైట్ ని కూల్చి వేయడానికి ప్రయత్నించాడు, తీవ్రంగా గాయపడి రక్తం కారుతున్నప్పటి కీ ఎంతో ధైర్య సాహసాలతో పోరాడి కాక్ పిట్ తలుపులు తెరిచి తోటి సిబ్బంది ప్రయాణికుల కు ఈ దాడిని చూసే విధంగా చేసి హమీద్ ని సిబ్బందికి అప్పగించి, ఆ విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ విమానశ్రయం లో సురక్షితంగా ఎమర్జెన్సీ లాండింగ్ చేసి సుమారు 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన సైలెంట్ హీరో పైలెట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ కి భారత దేశ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము మరియు ప్రధాని నరేంద్ర మోదీ తో పాటు ఇజ్రాయిల్ ప్రధాని, రష్యా, అమెరికా అధ్యక్షులు మరియు వివిధ దేశాల అధ్యక్షులు మరియు ప్రపంచ ప్రజల నుంచి ప్రశంసలు పొందిన పైలెట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్య సాహసాలకి శుభాకాంక్షలు తెలుపుతూ ఒక పొగడ మొక్కను తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కార్పొరేట్, ప్రకాశం స్టేడియం ఆవరణలో నాటిన మొక్కల కె.ఎన్ రాజశేఖర్ ప్రకృతి ప్రేమికుడు, తను క్రితం లో ప్రతిరోజు ఏదైనా ఒక మొక్కని నాటుతూ ఫోటో ఆ వీడియో తీస్తూ 114 వ మన్ కీ బాత్ కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోధీ చే ప్రశంసలు పొందిన ప్రకృతి ప్రేమికుడు మొక్కల కె . ఎన్ రాజశేఖర్.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, తాళ్ల గూడెం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు నల్లమోతు వెంకట నరసయ్య

కామేపల్లి, అక్టోబర్ 3 మీ వార్త ప్రతినిధి :



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకు నేందుకు అర్హులైన గ్రాడ్యుయేటర్లు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కామేపల్లి మండలం తాళ్ల గూడెం మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నల్లమోతు వెంకట నరసయ్య శనివారం కోరారు.ఫాం -18 ద్వారా 2023 నవంబర్ నాటికి డిగ్రీ, లేదా దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదు చేసుకో వాలని కోరారు.వచ్చే నెల 6 తేదీ లోగా దరఖాస్తు చేసు కోవాలని కోరారు.ఓటర్ ఐడి కార్డు,ఆధార్ కార్డు, డిగ్రీ / గ్రాడ్యుయేషన్ సర్టిఫికే ట్,పాస్పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నంబర్ తో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు అర్హులైన వారికి విజ్ఞప్తి చేశారు.

## మారుతి కార్లపై పండుగ బొనాంజా.. రూ 1.36 లక్షల వరకు డిస్కౌంట్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ పండుగ బొనాంజాను ప్రకటించింది. అక్టోబర్ నెలలో నెక్సా షోరూంలో లభించే అన్ని రకాల మాడళ్లపై రూ.1.36 లక్షల వరకు డిస్కౌంట్‌ను అందిస్తున్నది. వీటలో నగదు రూపంలో, ఎక్స్చేంజ్ బోనస్ కింద, లాయల్టీ కింద కలుపుకుని మొత్తంగా లక్ష రూపాయలకు పైగా రాయితీని ఇస్తున్నది. వీటిలో గ్రాండ్ విటారాపై అత్యధికంగా రూ.1.36 లక్షల వరకు అందిస్తున్న సంస్థ.. డెల్టా పెట్రోల్ వెర్షన్‌పై రూ.1.26 లక్షలు, ఎక్స్ఎల్6పై రూ.61 వేలు, జిన్నీ మాడల్‌పై రూ.35 వేలు, ఈ-విటారాపై రూ.95 వేలు, ఫ్రాంక్స్‌పై రూ.27,100 చొప్పున రాయితీని ఇస్తున్నది.

# వికటించిన వైద్యం డెంగ్యూతో పదేళ్ల చిన్నారి మృతి..

- ప్రాథమిక చికిత్స పేరుతో ఆర్ఎంపి కాలయాపన ...
- సమయానికి సరైన వైద్యం అందకనే మృత్యువు ఒడిలోకి....

ఇల్లెందు, అక్టోబర్ 03, మీ వార్త ప్రతినిధి

పట్టణంలోని 17వ వార్డులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది సమయానికి. సరైన వైద్యం అందక, పదేళ్ల పసిపాప ప్రాణాలు కోల్పోయింది. సుజాత మనోహర్ తివారి దంపతుల ముద్దుల కూతురు కోమలి (10) విష జ్వరంతో

గత పది రోజులుగా బాధపడుతున్న చిన్నారికి, ఆమ్ బజార్‌లోని వసుమతి వైద్యశాల కింద ఉన్న ఓ ఆర్ఎంపీ వద్ద ప్రాథమిక చికిత్స పేరుతో కాలయాపన చేశారు.

పరిస్థితి పూర్తిగా విషమించి, ప్లేట్లెట్లు పూర్తిగా పడిపోయిన తర్వాత గానీ అసలు విషయం గుర్తించలేకపోయారు. ఈ నెల 1వ తేదీన హడావుడిగా ఖమ్మం తరలించగా, అక్కడ ప్రైవేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందక పరిస్థితి మరింత క్షీణించింది. చివరికి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆ పసిపాప ప్రాణాలు విడిచింది. పట్టణంలో జ్వరాలు ప్రబలుతున్నా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం

ప్రాథమిక చికిత్స పేరుతో ఆర్ఎంపీ కాలయాపన...




నిద్రమత్తు వీడకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి, ఆర్ఎంపీల అక్రమ వైద్యాలపై, నాణ్యతా లోపించిన ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం ఇల్లెందుకు రానున్న డీఎంఅండ్‌హెచ్ఓ ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచి చూడాలి.

# సంకల్పయాత్రకు స్వాగతం పలికిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు

ఇల్లందు అక్టోబర్ 03, మీ వార్త ప్రతినిధి

- తిరుపతి నుంచి వారణాసి వెళ్తు భద్రాద్రి జిల్లాకు చేరుకున్న సేవా సంకల్పయాత్ర

భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా ప్రధానమంత్రిగా పాతికేళ్ల ప్రస్థానం పూర్తి చేసిన సందర్భంగా చేపట్టిన సేవాసంకల్ప యాత్ర తిరుపతి నుంచి వారణాసి వరకు కొనసాగుతుంది... తెలుగుదేశం పార్టీ నాయకులు ఏపీ మంత్రి నారా లోకేష్ పిలుపుమేరకు (సాప్) స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, తెలుగు నాడు స్టేట్ ఫెడరేషన్ నాయకులు రవి నాయుడు, ప్రణయ్ గోపాల్ విశాఖపట్నం మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ వారి ఆధ్వర్యంలో సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నారు

యాత్ర భద్రాద్రి జిల్లా చేరుకొని భద్రాచలం రామాలయం దర్శనం అనంతరం ఇల్లందుకు చేరుకుంది. వారికి తెలుగుదేశం పార్టీ ఇల్లందు నియోజకవర్గ నాయకులు ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధిలో కొనసాగిస్తుందని తెలిపారు. తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు



ఈ కార్యక్రమంలో విజయవాడ కనకదుర్గ గుడి బోర్డు మెంబర్ హరిత, పొగాకు జయరాం, సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, వార్డు సభ్యులు అఖిల్, దాసరి గోపాలకృష్ణ, పాల్గొన్నారు

# రుణాలు తీసుకున్నవారికి షాక్..
# పెరగనున్న గృహ, వాహన రుణాలు

**ముంబై :** గృహ, వాహన, వ్యక్తిగత ఇతరత్రా రుణాలు భారం కానున్నాయా? అంటే.. అవుననే అంచనాలే వినిపిస్తున్నాయి. వచ్చే వారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షను జరుపనున్నది. ఈ సందర్భంగా కీలక వడ్డీరేటైన రెపోరేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) పెంచవచ్చన్న అభిప్రాయాలు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి మరి. ఇదే జరిగితే దానికి అనుగుణంగా బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను పెంచడం ఖాయం. ఫలితంగా హోమ్, ఆటో, పర్సనల్ తదితర లోన్ల ఈఎంఐలు పెరిగిపోతాయంటున్నారు.




### ద్రవ్యోల్బణంతో తిప్పలు

పశ్చిమాసియా సంక్షోభం, వర్షాభావ పరిస్థితులు.. దేశంలో ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయి. ఈ క్రమంలోనే గత నెలకుగాను వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 5.65 శాతంగా నమోదు కావచ్చని, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఇది 6.5 శాతాన్ని దాటే వీలుందని ఎస్బీఐ రిసెర్చ్ తమ తాజా నివేదికలో పేర్కొన్నది. అమెరికా-ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పరుగులు పెడుతున్న విషయం తెలిసిందే. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో పెరిగే క్రూడాయిల్ రేట్లు.. భారత్‌పై అనేక రకాలుగా దుష్ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా రవాణా ఖర్చులు పెరిగిపోతున్నాయి. మరోవైపు ఎల్ నినో కారణంగా వర్షాలు లేక వ్యవసాయం అంతంతమాత్రమే అన్నట్టు తయారైంది. ఈసారి ఆహార పంటల దిగుబడులు చాలావరకు తగ్గిపోవచ్చన్న అంచనాలు గుబులు పుట్టిస్తున్నాయి. ఇప్పటికే కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. కిలో రూ.70-100 పలుకుతున్నాయి. పప్పు దినుసులు, వంట నూనెలు, పండ్లు, మాంసాహారం సంగతి సరేసరి. దీంతో రాబోయే నెలల్లో ఇటు రిటైల్, అటు హోల్‌సేల్ ద్రవ్యోల్బణ గణాంకాలు విజృంభిస్తాయనే అంటున్నారంతా. ఈ నేపథ్యంలో ద్రవ్యోల్బణం కట్టడికి ఈసారి ద్రవ్య సమీక్షలో ఆర్బీఐ రెపోరేటును కనీసం పావు శాతమైనా తప్పక పెంచుతుందన్నదే ఎస్బీఐ రిసెర్చ్ మాట. నిజానికి గత ఏడాది డిసెంబర్ నుంచి రెపోరేటును ఆర్బీఐ యథాతథంగానే ఉంచుతున్నది. ప్రస్తుతం అది 5.25 శాతంగా ఉన్న సంగతి విదితమే. ఈ నెల 5-7 తేదీల్లో ఆర్బీఐ ద్రవ్య సమీక్ష జరుగనున్నది. బుధవారం సమీక్ష నిర్ణయాలు వెలువడుతాయి.

### రూపాయి వెలవెల

కరెన్సీ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ అంతకంతకూ దిగజారుతున్నది. మళ్లీ రూ.96 మార్కు ఎగువ (96.25)కు చేరింది. రూపీ నష్టాలు.. దేశీయ దిగుమతుల్ని భారం చేయడమేగాక, అన్ని రంగాలనూ దెబ్బ తీస్తున్నది. దేశంలో ద్రవ్యోల్బణం విజృంభణకు రూపాయి విలువ పతనం కూడా కారణమేనని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ఇక విదేశీ మదుపర్లు తమ పెట్టుబడులను అదేపనిగా ఉపసంహరించుకుంటుండటం కూడా దేశీయ డాలర్ నిల్వలపై ఒత్తిడిని పెంచుతున్నదని గుర్తుచేస్తున్నారు.

ఈ ఒక్క వారంలోనే భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.34,970 కోట్ల పెట్టుబడులను విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు వెనుకకు తీసుకున్నారు. కాగా, ఆర్బీఐ వడ్డీరేట్ల పెంపు.. గృహ, వాహన తదితర కీలక రంగాల్లో వృద్ధిని అడ్డుకోగలదని, ప్రజల కొనుగోలు శక్తిపైనా ఆ ప్రభావం పడగలదని విశ్లేషకులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమ్మకాలు క్షీణించి, ఉత్పాదకత దెబ్బతినవచ్చని, ఉపాధి అవకాశాలూ సన్నగిల్లే ప్రమాదం ఉందని అంటున్నారు. మొత్తానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో వడ్డీరేట్లు పెరిగితే.. దేశ జీడీపీ తగ్గిపోయే ప్రమాదం కచ్చితంగా ఉందంటున్నారు. ఈ క్రమంలో రాబోయే ద్రవ్య సమీక్షలో ఆర్బీఐ ఏం నిర్ణయం? తీసుకుంటుందోనన్న ఉత్కంఠ అంతటా నెలకొన్నదిప్పుడు.

# ప్రకటనల్లో ఏఐ వాడకం... పరిధి దాటితే ప్రమాదం: అస్కి కోడ్ రెడీ...

కృత్రిమ మేధ(ఏఐ)ను అత్యధికంగా ఉపయోగించుకుంటున్న రంగాల్లో ప్రకటనల రంగం ముందుంది. ఏఐ ఆధారంగా తమ ఉత్పత్తుల విశిష్టతలను చాటుకోవడానికి ఆరాట పడుతున్న పలు సంస్థలు బ్రాండ్‌ల వేగానికి కళ్లెం వేయడానికి అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సిఐ) సిద్ధమైంది ఈ తరహా కృత్రిమంగా రూపొందించిన సింథటికల్లీ జనరేటెడ్ కంటెంట్ (ఎస్‌జిసి)ను ప్రకటనల్లో బాధ్యతాయుతంగా లేబులింగ్ చేయాలి అంటూ తగిన మార్గదర్శకాలు'ను తాజాగా విడుదల చేసింది. ప్రకటనల కంటెంట్‌ను రూపొందించడానికి, బ్రాండ్‌లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ?స (ఏఐ)ను వాడుకోవడం పెరుగుతున్న నేపథ్యంలో, అటువంటి కంటెంట్ వినియోగదారులపై చూపే ప్రభావంపై ఈ మార్గదర్శకాలు రూపొందాయి కృత్రిమ కంటెంట్ ను ఉపయోగించినప్పుడు దాని గురించి ఎలా వెల్లడించాలి? అలాగే ఎలాంటి వినియోగాలను అనుమతించవచ్చనే అంశాలను ఈ మార్గదర్శకాలు వివరిస్తాయి. గత మే నెలలో విడుదల చేసిన ముసాయిదా మార్గదర్శకాలపై వివిధ వర్గాలతో సంప్రదింపులు జరిపిన అనంతరం తుది మార్గదర్శకాలను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం... ప్రకటనల్లో ఏఐ లేబుల్‌ను ఉపయోగించినప్పటికీ, చట్టవిరుద్ధమైన, హక్కులను ఉల్లంఘించే, తప్పుదారి పట్టించే క్లెయిమ్‌లను కలిగి ఉన్న లేదా కోడ్‌ను ఉల్లంఘించే ప్రకటనలు నిషేధించే అవకాశం ఉంటుంది. కల్పిత ఆమోదాలు లేదా ప్రశంసాపత్రాలను ఉపయోగించడం కృత్రిమంగా రూపొందించిన యాడ్స్ ద్వారా ప్రొడక్టు ఫలితాలు లేదా లక్షణాలను తప్పుదారి పట్టించే విధంగా అతిశయోక్తి జోడించడం కస్టమర్లను తప్పుదారి పట్టించే విధంగా ఉనికిలో లేని ప్రదేశాలు లేదా పరిసరాలను వాస్తవమైనవిగా చూపించడం అనధికారిక కాపీరైట్ కంటెంట్‌ను ఉపయోగించడం సంబంధిత వ్యక్తి అనుమతి లేకుండా డీప్‌ఫేక్‌లు లేదా వారి పోలికను ఉపయోగించడం కస్టమర్ల నిర్ణయాలను గణనీయంగా ప్రభావితం చేసే చోట దానిని వెల్లడించకపోవడం కస్టమర్లను తప్పుదారి పట్టించే అవకాశం ఉన్న చోట లేబులింగ్ తప్పనిసరి. అందులో.... కృత్రిమ ఇన్ఫ్లుయెన్సర్‌లుఅంబాసిడర్‌ల వినియోగం వ్యక్తిగతీకరించిన



సందేశాల కోసం, సమ్మతితో ఒక నిజమైన వ్యక్తి పోలికను లేదా స్వరాన్ని పునఃసృష్టించడం ప్రోడక్టు లేదా సేవపై కస్టమర్ల అవగాహనను ప్రభావితం చేయగల కల్పిత సంఘటనలు లేదా సెట్టింగ్‌ల సృష్టి ప్రస్తుతం ఉనికిలో లేని ప్రోడక్టులకు సంబంధించిన ప్రదర్శన --హెడ్‌ఫోన్‌ల వంటి ఉత్పత్తి ప్రధాన ఫీచర్‌లకు జోడించే సౌండ్ ఎఫెక్ట్‌లు చెల్లింపు లేదా స్పాన్సర్ చేయబడిన ఏఐ ఉత్పత్తిపై తప్పనిసరిగా "స్పాన్సర్డ్ బై ర(బ్రాండ్‌ర్)రి" అని ప్రత్యేకంగా లేబుల్ చేయాలి.

## మద్దులపల్లి లో వీధి దీపాలు ఏర్పాటు

- గ్రామస్తులకు విద్యుత్ వెలుగులు అందించడమే లక్ష్యం
- సర్పంచ్ నాగమణి, సెక్రటరీ విక్రమ్, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు





కామేపల్లి, అక్టోబర్ 3 మీ వార్త ప్రతినిధి :

కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో శనివారం వీధిలైట్ల ను ఏర్పాటు చేశారు.సర్పంచ్ పడిగ నాగమణి, ఉప సర్పంచ్ గడ్డం వెంకటేశ్వర్లు, పంచాయితీ కార్యదర్శి కె. విక్రమ్ సారధ్యంలో సిబ్బంది. స్తంభాలకు వీధిలైట్లను ఏర్పాటు చేశారు.రాత్రి వేళలో గ్రామస్తులకు అంధకారం తొలగించి విద్యుత్ వెలుగులు అందించడమే లక్ష్యంగా గ్రామంలో వీధిలైట్లను ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి

- లావుడియా అస్లీ చిత్రపటానికి నివాళులు






కామేపల్లి, అక్టోబర్ 3మీ వార్త ప్రతినిధి :

కామేపల్లి మండలం గోవింద్రాల లో మృతిచెందిన లావుడియా అస్లీ చిత్రపటా నికి తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామ్ రెడ్డి కృష్ణారెడ్డి నివాళులర్పించారు. శనివారం నిర్వహించిన అస్లీ దశదిన కార్యక్రమం లో పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించారు.ఆమె మృతి పట్ల సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ గింజల నరసింహారెడ్డి,జిల్లా నాయకులు మద్దినేని రమేష్ బాబు,మాజీ ఎంపీటీసీ లు రాశీరెడ్డి జగన్నాథరెడ్డి,నల్లమోతు లక్ష్మయ్య, మార్కెట్ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్, కొత్త లింగాల సర్పంచ్ ఇట్టా శ్రీను,కామేపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు భూక్య సీతారాములు,గోవింద్రాల, కొత్త లింగాల గ్రామ కాంగ్రెస్ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

## ఇంద్లాతండా గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

డీఎస్పీ కార్యాలయం, ఇల్లందు,03.10.2026, మీ వార్త ప్రతినిధి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున ఇల్లందు సబ్‌డివిజన్ పోలీసు సిబ్బంది, టీజీఎస్‌పీ సిబ్బందితో కలిసి కొమరారం గ్రామపంచాయతీ పరిధిలోని ఇంద్లాతండా గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. 30 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోల ధ్రువపత్రాలు పరిశీలించి సరియైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే గంజాయి వంటి అక్రమ మాదకద్రవ్యాల విక్రయాలు, నిల్వలు, గుడుంబా తయారీ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు, విలువైన మరియు విశ్వసనీయ సమాచారాన్ని అందించిన వారికి తగిన ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, టీజీఎస్‌పీ సిబ్బంది కలిపి మొత్తం 60 మంది పోలీసులు పాల్గొన్నారు.







## హోప్ శతకం.. విండీస్ విజయం



**చండీగఢ్:** భారత్ చేతిలో వెస్టిండీస్ జట్టు వైట్‌వాష్ తప్పించుకుంది. షై హోప్ (162 నాటౌట్) భారీ శతకంతో విజృంభించడంతో శనివారం జరిగిన మూడో, చివరి వన్డేలో 5 వికెట్లతో టీమిండియాను ఓడించింది. ఫలితంగా సిరీస్‌ను స్వీప్ చేయలేకపోయిన భారత్ 2-1తో సరిపెట్టుకుంది. హోప్ మెరుపులతో భారత్ ఇచ్చిన 352 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 48.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జంగూ (67), కీమో పాల్ (44) రాణించారు.తొలుత భారత్ 50 ఓవర్లలో 351/7 చేసింది.కేఎల్ రాహుల్ (129 నాటౌట్) సెంచరీ కొట్టగా..రోహిత్ శర్మ (92), రుతురాజ్ (57) కూడా సత్తా చాటారు. హోప్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, గిల్‌కు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్‌లో తొలి పోరు మంగళవారం లక్నోలో జరుగుతుంది.

# శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' టైటిల్ సాంగ్ విన్నారా..?




శ్రీ విష్ణు హీరోగా వస్తోన్న లేటేస్ట్ మూవీ కామ్రేడ్ కల్యాణ్. ఈ సినిమాకు జానకీరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈమూవీ అక్టోబరు 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రాన్ని స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ అండ్ కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి పలు పాటలను విడుదల చేశారు. తాజాగా టైటిల్ సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. విజయ్ బుల్గానిన్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. కాగా ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## రెండు వారాల గ్యాప్‌లో సాయిపల్లవి రెండు పాన్ ఇండియా సినిమాలు.. హీరోయిన్‌కు ప్లస్సా? నిర్మాతలకు రిస్కా?

ఒక సినిమా కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్న సమయంలోనే అదే హీరో లేదా హీరోయిన్ నటించిన మరో సినిమా థియేటర్లలోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది? సాధారణంగా ఒకే నటుడి సినిమాలు తక్కువ గ్యాప్‌లో విడుదలైతే బాక్సాఫీస్ పరంగా పోటీ నెలకొనే అవకాశం ఉంటుంది. అయితే స్టార్ హీరోయిన్ సాయిపల్లవి విషయంలో ఇప్పుడు ఇదే పరిస్థితి కాస్త ఆసక్తికరంగా మారింది. ఆమె నటించిన రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలు కేవలం రెండు వారాల వ్యవధిలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. సాయిపల్లవికి ఇది నటిగా మంచి అవకాశంగా కనిపిస్తున్నప్పటికీ, రెండు సినిమాల నిర్మాతలకు మాత్రం థియేటర్ల కేటాయింపు, ప్రచార కార్యక్రమాలు, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం వంటి అంశాల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యష్ రావణుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'రామాయణ: పార్ట్ 1'. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నవంబర్ 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో సాయిపల్లవి సీత పాత్రలో కనిపించనుండటంతో ఆమె పాత్రపై కూడా భారీ ఆసక్తి నెలకొంది. 'రామాయణ: పార్ట్ 1' విడుదలైన సరిగ్గా రెండు వారాల తర్వాత సాయిపల్లవి నటించిన మరో భారీ చిత్రం 'ఓం: చాప్టర్ 1 -- ఉదిరం' థియేటర్లలోకి రానుంది. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మమ్ముట్టి, శ్రీలీల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాయిపల్లవి కూడా కథలో ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఆమె పాత్రలో యాక్షన్, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉంటుందని ప్రచారం జరుగుతోంది. రెండు సినిమాల మధ్య కేవలం 14 రోజుల గ్యాప్ ఉండటంతో థియేటర్ల కేటాయింపు విషయంలో కొంత ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా 'రామాయణ: పార్ట్ 1'కు భారీ స్పందన వచ్చి ఎక్కువ కాలం థియేటర్లలో కొనసాగితే, రెండు వారాల తర్వాత విడుదలయ్యే 'ఓం: చాప్టర్ 1 -- ఉదిరం'కు థియేటర్లు సర్దుబాటు చేయడం కొంత సవాలుగా మారవచ్చు.. అయితే ఈ రెండు సినిమాలు సాయిపల్లవికి ఒక విషయంలో ప్రత్యేకమైన అవకాశాన్ని ఇవ్వనున్నాయి.





# 'జైలర్ 2' కోసం తప్పుకున్న ధనుశ్.. 'ఓం చాప్టర్ 1' కొత్త విడుదల తేదీ ఖరారు!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుశ్, లెజెండరీ నటుడు మమ్ముట్టి ప్రధాన పాత్రలలో నటిస్తున్న తాజా చిత్రం 'ఓం చాప్టర్ 1'. ఈ సినిమా విడుదల తేదీని తాజాగా ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమాను నవంబర్ 20, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరిసామి దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా అనుకున్న ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'జైలర్ 2' అక్టోబర్ 15న విడుదలవుతుండటంతో, రజినీకాంత్ పై ఉన్న అపారమైన గౌరవంతో ధనుశ్ ఈ సినిమా విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు గతంలోనే ప్రకటించారు. రూ. 600 కోట్లకు పైగా వసూళు సాధించిన 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'జైలర్ 2'తో బాక్సాఫీస్ వద్ద పెద్ద ఎత్తున క్లాష్ ఏర్పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. రజినీకాంత్ సినిమాతో పాటు, దీపావళి బరిలో నిలవాలని భావించిన హిందీ చిత్రం 'రామాయణ పార్ట్ వన్' మరియు సూర్య నటిస్తున్న 'సీన్' సినిమాలతో కూడా ఎలాంటి పోటీ లేకుండా ఉండేందుకే ఈ నవంబర్ తేదీని లాక్ చేసినట్లు వెల్లడించారు. పరిశ్రమలో పెద్ద సినిమాలు ఒకరి నిర్ణయాలను మరొకరు గౌరవించుకోవాలని, పరస్పర అవగాహనతో ముందుకు వెళ్లాలని ధనుశ్ అభిప్రాయపడ్డారు. రాజ్‌కుమార్ పెరిసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సాయి పల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఎజిల్ అరసు కె. సినిమాటోగ్రఫీ, ఆర్. కలైవనన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శ్రద్ధా అగర్వాల్, ధనుశ్, అజ్మత్ జగ్మగ్ సంయుక్తంగా వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ పతాకాలపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# ఆ నీచులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టను: ఎన్టీఆర్ వార్నింగ్



గత కొన్ని గంటలుగా సోషల్ మీడియాలో 'చుట్టమల్లే'(దేవర సినిమా) పాట తెగ వైరల్ అవుతుంది. ఏఐ ద్వారా అత్యంత నీచంగా ఎడిట్ చేసిన ఈ వీడియోని కొంతమంది సోషల్ మీడియాలో షేర్ చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. అలాంటివారిపై హీరో ఎన్టీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఏఐ ద్వారా ఎడిట్ చేసిన ఆ వీడియోని షేర్ చేసిన వారిపై లీగల్ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించాడు. ఒక ఆడపిల్లను అత్యంత అవమానకరంగా చూపేందుకు ఏఐని ఉపయోగించడం సిగ్గు చేటు అని.. ఎట్టిపరిస్థితుల్లోనూ వారిని వదిలిపెట్టబోనని హెచ్చరించాడు. ఈ మేరకు ఎక్స్‌లో సుధీర్ఘమైన పోస్ట్ పెట్టాడు.

'మహిళలను తల్లులుగా, దేవతలుగా గౌరవించే దేశంలో.. 'మాతృదేవోభవ' అనేది కేవలం ఒక మాట మాత్రమే కాదు, మన సంస్కృతిలో భాగం. అలాంటి సమాజంలో కొందరు ఇంత దిగజారి.. ఒక మహిళను అత్యంత అవమానకరంగా చూపించేందుకు ఏఐ (ఘూ×) సాంకేతికతను దుర్వినియోగం చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. ఇలాంటి దారుణమైన మార్ఫింగ్ వీడియోను రూపొందించేందుకు ఏఐని ఉపయోగించడం సిగ్గుచేటు. 'చుట్టమల్లే' వీడియోను మార్ఫింగ్ చేసి, అసభ్యకరంగా రూపొందించిన ఆ నీచులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టను. ఈ వీడియోను రూపొందించిన వారితో పాటు దాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై కూడా అన్ని రకాల చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. దయచేసి ఇలాంటి కంటెంట్‌ను ఎవరూ చూడొద్దు.. షేర్ చేయొద్దు.. ఎంగేజ్ అవ్వొద్దు అని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈరోజు బాధితురాలు మరొకరు కావచ్చు.. రేపు అది మీ తల్లి, సోదరి, భార్య లేదా కుమార్తె కావచ్చు. ఇది చాలా తీవ్రమైన సమస్య. ఏఐ సాంకేతికత దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్రం కూడా కఠినంగా వ్యవహరించాలని, పటిష్ఠమైన నిబంధనలు తీసుకురావాలని కోరుతున్నాను' అని ఎన్టీఆర్ ట్వీట్ చేశాడు.

# అల్లు అర్జున్ 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి లేదా .. క్లారిటీ ఇచ్చిన హీరోయిన్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. దీంతో సినిమా కథ, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన పలువురు ప్రముఖ కథానాయికలు కనిపించనున్నారనే వార్తలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. దీపికా పదుకొణె, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్ వంటి పేర్లు ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌తో ముడిపడి ప్రచారంలో ఉన్నాయి. ఈ క్రమంలో మరో హీరోయిన్ పేరు కూడా తెరపైకి వచ్చింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ సినిమాల్లోనూ గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య లక్ష్మి 'రాకా'లో నటించబోతున్నారంటూ ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ వార్త అభిమానుల్లోనూ ఆసక్తిని పెంచింది. అయితే తాజాగా ఈ ప్రచారంపై ఐశ్వర్య లక్ష్మి స్వయంగా స్పందించింది. తాను 'రాకా' సినిమాలో భాగం కాదని ఆమె స్పష్టం చేసింది. అంతేకాదు, తనను ఎవరైనా ఈ సినిమాలో చేర్చాలని సరదాగా స్పందించడం ఆసక్తికరంగా మారింది. దీంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఐశ్వర్య లక్ష్మి 'రాకా' తారాగణంలో లేరని భావించవచ్చు. అయితే సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో భవిష్యత్తులో తారాగణానికి సంబంధించి మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. అల్లు అర్జున్, అట్లీ కలయికలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. అట్లీ గతంలో భారీ కమర్షియల్ అంశాలతో సినిమాలను తెరకెక్కించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు అల్లు అర్జున్‌తో కలిసి చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు సమాచారం. సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులు భాగం కానున్నారనే ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా కథకు అనుగుణంగా ఒకటి కంటే ఎక్కువ కీలక మహిళా పాత్రలు ఉండనున్నాయని, వాటి కోసం స్టార్ హీరోయిన్లను తీసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే పూర్తి తారాగణంపై చిత్రబృందం అధికారికంగా ప్రకటించే వరకు ప్రచారంలో ఉన్న పేర్లను నిర్ధారించలేం. 'రాకా' సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు.

